www.jananinadam.com

Follow:

జనినాదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం



గురువారం 15-10-2026

సంపుటి : 2 సంచిక : 158

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 06

వెల: రూ.2.00

Simultaneously published from ,Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?..

ట్రంప్, నెతన్యాహు మధ్య రహస్య చర్చలు

ఎన్నికల ముందు ఇరాన్‌పై సైనిక చర్యకు ట్రంప్, నెతన్యాహు చర్చలుఇరాన్ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తోందని నెతన్యాహు ఆందోళనముందుకెళ్లండి అని చెప్పి.. సలహాదారులతో మాట్లాడి వెనక్కి తగ్గిన ట్రంప్‌సైనిక చర్యకు అమెరికా రక్షణ మంత్రి మొగ్గు, ఇతర సలహాదారుల వ్యతిరేకతఇరు దేశాల సైనిక బలగాలు అప్రమత్తం, పూర్తిస్థాయిలో సన్నాహాలుఅంతర్జాతీయంగా తీవ్ర ఉ

2



2047నాటికి3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను చేస్తామన్న సీఎం

దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడి

కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలని వ్యాఖ్య

2వ పేజీలో...

2047వ సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈరోజు 'సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై తమ ప్రభుత్వ దార్శనికతను వివరించారు. ఈ భారీ లక్ష్య సాధనలో భాగంగా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 'వికసిత్ భారత్ సాధించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రగతి ప్రణాళికలు ఉన్నాయని, ఈ లక్ష్య సాధనకు కేంద్ర, రాష్ట్రాల సహకారం అవసరమని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని... అభి వృద్ధి విషయంలో కాదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం 'జఖ=జు ఖ=జు, నా=జు' అనే త్రిముఖ వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు

సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన



2వ పేజీలో...

హైదరాబాద్, అక్టోబర్ 14: తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా అర్హత సాధించిన వారు, ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారి కోసం ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఈ క్యాంప్‌లను

తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ

జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన సీజేపీ నేతలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

అరెస్టులను తీవ్రంగా ఖండించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

త్రివర్ణ పతాకాన్ని ఎగరేయడం నేరం కాదని వ్యాఖ్య

ఢిల్లీ 14: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపినందుకు అరెస్టయిన కాక్ రోచ్ జనతా పార్టీ (జజ్రో) నేతలకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతుగా నిలిచారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ జాతీయ జెండాను ఎగురవేయడం నేరం కాదని, ఇందుకోసం యువతను జైల్లో పెట్టడం పిరికిపంద చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... నిరసన ప్రదేశం కాదని ఇటీవల ప్రకటించిన జంతర్ మంతర్లోకి ప్రవేశించారనే ఆరోపణలపై సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదయం వారిని కోర్టులో హాజరుపరచగా... న్యాయస్థానం వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. గతంలో ఒకసారి అరెస్టయి, శాంతి ఒప్పందం (పీస్ బాండ్)పై సంతకం చేసి విడుదలైన వీరు...ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించినందున కస్టడీకి పంపినట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు అరెస్టయిన అజింక్యా షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. ఈ అరెస్టులపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "జంతర్ మంతర్ భారత ప్రజలది. దానిని మేం తిరిగి స్వాధీనం చేసుకుంటాం. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి.. అందరిదీ ఒకే లక్ష్యం. అదే పౌరుల



రాజ్యాంగ హక్కుల పరిరక్షణ" అని పేర్కొన్నారు. రాహుల్తో పాటు అరవింద్ కేజ్రివాల్, ఎంకే స్టాలిన్, అభిషేక్ బెనర్జీ, ఆదిత్య థాకరే వంటి పలువురు విపక్ష నేతలు కూడా ఈ అరెస్టులను ఖండించారు. తమకు మద్దతు ప్రకటించినందుకు రాహుల్ గాంధీకి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు.

సిద్ధిపేటలో రేవంత్ టూర్.. అప్రమత్తమైన హరీశ్ ...!

సిద్ధిపేట,అక్టోబరు 14: తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధం ముదురుతోంది. బీఆర్ఎస్ కీలక నేతల నియోజకవర్గాలను ప్రధాన లక్ష్యంగా చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి దూకుడు పెంచారు. ప్రత్యక్షంగా అక్కడికి వెళ్లడం, బహిరంగ సభలు నిర్వహించడం, తద్వారా స్థానిక నేతల అక్రమాలు, వైఫల్యాలను ఎండగట్టడం కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సిరిసిల్ల పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, తదుపరి అస్త్రాన్ని హరీశ్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్ధిపేటపై ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.ఇటీవల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ పర్యటనలో కేటీఆర్‌కు సంబంధించిన ఆరోపణలు, అక్రమాస్తులు, హోటళ్ల అంశాలను రేవంత్ రెడ్డి బహిరంగంగానే ప్రస్తావించారు. ఈ ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ కలకలం రేపాయి. ఆ తర్వాత రేవంత్ రెడ్డి ప్రస్తావించిన ఆ హోటళ్లు తనవేనని కేటీఆర్ కూడా బహిరంగంగా అంగీకరించడంతో ఈ అంశం మరింత ఊపందుకుంది. ఈ క్రమంలోనే సిరిసిల్ల తరహాలోనే హరీశ్ రావు నియోజకవర్గమైన సిద్ధిపేటను కూడా టార్గెట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.సీఎం రేవంత్ రెడ్డి



2వ పేజీలో...

ఏసేపు, నాగన్న కుటుంబ సభ్యులను ఓదార్చిన హరీశ్‌రావు

ఆర్థిక సాయం అందజేత

గద్వాల 14: గట్టు మండలం ఇందువాసి గ్రామంలో ఇటీవల ఉపాధి కోసం కర్ణాటకకు వలస వెళ్లి, యాదగిరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దళిత వలసకూలీల కుటుంబాలను, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కలిసి పరామర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఇందువాసి గ్రామానికి చేరుకున్న హరీశ్ రావు.. మరణించిన ఏసేపు, నాగన్న కుటుంబ సభ్యులను ఓదార్చి, బీఆర్ఎస్ పార్టీ తరపున వారికి తక్షణ ఆర్థిక సాయం అందజేశారు.ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు, కాళ్లు చేతులు విరిగి నడుము ఫ్రాక్చర్ అయిన క్షతగాత్రులకు పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ పర్యటనలో హరీశ్ రావు వెంట మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, స్థానిక సీనియర్ నాయకులు హన్మంతు నాయుడు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ..గద్వాల జిల్లా ఇందువాసి గ్రామంలో దాదాపు 40 దళిత కుటుంబాలు కూలి పనుల కోసం పక్క రాష్ట్రమైన కర్ణాటకకు వెళ్లాయి.



అక్కడ యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరి పరిస్థితి ఆస్పత్రిలో విషమంగా ఉంది. చాలామందికి కాళ్లు, చేతులు, నడుములు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ గారు స్పందించి.. తక్షణమే బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. కేసీఆర్ గారి ఆదేశంతోనే మేమంతా ఇక్కడికి వచ్చాం. చనిపోయిన కుటుంబాలకు, గాయపడ్డ కుటుంబాలకు పార్టీ పరంగా తక్షణ సహాయం అందజేశాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈ దళిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునేలా తీవ్ర ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు.అత్యంత బాధాకరమైన విషయం ఏంటంటే.. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సొంత జిల్లా పాలమూరు. ఈ జిల్లాలోనే

వ్యక్తిగత శత్రువులు ..రాజకీయాల్లో ప్రత్యర్థులు



2


హైదరాబాద్ అక్టోబరు14: తెలంగాణ రాజకీయాల్లో రోజురోజుకూ ప్రజా సమస్యల ప్రాతిపదికన జరగాల్సిన చర్చలు కనుమరుగవుతూ, వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హనన డిజిటల్ దాడులే ప్రధాన ఎజెండాగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాలు, ప్రజా విధానాలపై ఆరోగ్యకరమైన విమర్శలు ఉండటం సహజం. అయితే, ప్రస్తుత తెలంగాణ రాజకీయ వాతావరణం ప్రజా సమస్యలను పక్కనపెట్టి, నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆరోగ్యం, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న క్యారెక్టర్ అస్సాసినేషన్ సంస్కృతికి అద్దం పడుతోంది.బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు అస్వస్థత, జ్వరం కారణంగా రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకుంటున్నట్లు, అందుబాటులో ఉండటం లేదని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. అయితే, ఒక నాయకుడి అనారోగ్యంపై సానుభూతి ప్రదర్శించాల్సింది పోయి, ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు, సోషల్ మీడియా విభాగం నేతలు దాని వెనుక ఏదో రహస్య కారణం ఉందంటూ

మాదాపూర్ ది జాయింట్ అల్ మండి

రెస్టారెంట్‌లో కలకలం..

మటన్ మండి లో పుచ్చిపోయిన పన్ను..

హైదరాబాద్14: మాదాపూర్‌లోని ది జాయింట్ అల్ మండి రెస్టారెంట్‌లో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. హోటల్‌లో కస్టమర్ ఆర్డర్ చేసిన మటన్ మండి లో ఏకంగా ఒక పుచ్చిపోయిన పన్ను రావడం కలకలం రేపింది. దీనిని గమనించిన కస్టమర్ వెంటనే రెస్టారెంట్ యాజమాన్యాన్ని నిలదీశారు.అయితే, తప్పును సరిదిద్దుకోవాల్సిన యాజమాన్యం మరింత దురుసుగా ప్రవర్తించింది. ఏం చేసుకుంటావో చేసుకో ఎక్కడైనా ఫిర్యాదు చేసుకో అంటూ కస్టమర్‌కు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి బెదిరింపులకు దిగింది.యాజమాన్యం వ్యవహారశైలిపై విసిగిపోయిన బాధితుడు వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ నిహారిక మాదాపూర్‌లోని ది జాయింట్ అల్ మండి రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు.రెస్టారెంట్‌కు చేరుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు అక్కడ ఆహార నాణ్యతపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. కిచెన్ పరిస్థితులు, వంట తయారీకి వాడుతున్న పదార్థాలు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలిస్తున్నారు.



సిద్ధిపేటలో రేవంత్ టూర్.. అప్రమత్తమైన హరీశే ...!

మొదటిపేజీ తరువాయి...

సిద్ధిపేట పర్యటన ఖాయమన్న సంకేతాలు వెలువడటంతో హరీశ్ రావు ముందుగానే అప్రమత్తమయ్యారు. తెలంగాణలో కొత్త జిల్లాలు ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా సిద్ధిపేటలో ఆయన భారీ సభ నిర్వహించారు. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సభలు నిర్వహించాలని బీఆర్ఎస్ పిలుపునిచ్చినా మిగిలిన చోట్ల ఆశించిన స్పందన రాలేదు. కానీ హరీశ్ రావు మాత్రం దీన్ని తనకు అనుకూలంగా మలచుకోవడంలో సఫలమయ్యారు. ఈ సమావేశాన్ని తన రాజకీయ బలప్రదర్శనకు చక్కని వేదికగా ఉపయోగించుకున్నారు.త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి సిద్ధిపేటకు వస్తారని, తనపై తీవ్రస్థాయిలో విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తారని హరీశ్ రావు ఈ సభలో ముందుగానే శ్రేణులకు వివరించారు. తనపై వచ్చే తుక్కు తుక్కు ఆరోపణలను నమ్మవద్దని ఆయన తన అభిమానులను, పార్టీ శ్రేణులను కోరారు. రేవంత్ రెడ్డి టార్గెట్ తనపైనే ఉంటుందని ముందే గ్రహించిన హరీశ్ రావు, కేడర్‌ను మానసికంగా సిద్ధం చేసే ప్రయత్నం చేశారు.కేవలం విమర్శలను తిప్పకొట్టడమే కాకుండా, అధికార పార్టీపై ఎదురుదాడికి కూడా హరీశ్ రావు ప్లాన్ చేశారు. సీఎం అయిన తర్వాత రేవంత్ రెడ్డి ఇప్పటివరకు సిద్ధిపేటకు రెండు సార్లు వచ్చినా, ఇక్కడ ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆయన విమర్శించారు. రేపు మరోసారి సీఎం వస్తే ఈ హామీల అమలుపై గట్టిగా నిలదీయాలని తన పార్టీ శ్రేణులకు, ప్రజలకు హరీశ్ రావు పిలుపునిచ్చారుమొత్తానికి, సీఎం రేవంత్ రెడ్డి రాకముందే సిద్ధిపేట వేదికగా హరీశ్ రావు రాజకీయ పావులు కదపడం, తనపై జరిగే దాడిని తిప్పకొట్టేందుకు ముందస్తు వ్యూహాలు రచించడం ఆసక్తికరంగా మారింది. సిరిసిల్లలో ఎదురైన పరిణామాల నుంచి గుణపాఠం నేర్చుకున్న బీఆర్ఎస్ నేతలు, సిద్ధిపేటలో ఎలాంటి వ్యూహాత్మక తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. రాబోయే రోజుల్లో సిద్ధిపేట వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరింత తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

ఏసేపు, నాగన్న కుటుంబ సభ్యులను ఓదార్చిన హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి...

పేద ఎస్సీ కుటుంబాలు పక్క రాష్ట్రానికి వలసపోయి ఇంత ఘోర ప్రమాదానికి గురైతే, ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ గానీ, ప్రభుత్వం గానీ కనీసం స్పందించలేదు. ఆ బాధిత కుటుంబాలకు సర్కార్ నుంచి నయాపైసా ఆర్థిక సాయం అందలేదు. సరైన వైద్యం అందక, చేతిలో డబ్బులు లేక ఆస్పత్రుల్లో క్షతగాత్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి జిల్లా అంటే బాధ్యత ఉంటుందేమో, పేద కుటుంబాలను ఆదుకుంటారేమో అనుకున్నాం కానీ.. ముఖ్యమంత్రికి సోయి లేకుండా పోయింది. ఈ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా, ఏ ఒక్క మంత్రి కూడా బాధితులను పట్టించుకున్న పాపాన గానీ, ఆదుకున్న పాపాన గానీ పోలేదు. ప్రభుత్వం వెంటనే చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, తీవ్రంగా గాయపడ్డ వారికి ప్రభుత్వం తరఫున మెరుగైన పూర్తి ఉచిత వైద్యం అందిస్తూనే తగిన ఆర్థిక సాయం అందించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో పల్లె పల్లె పాలమూరులోన పల్లేర్లు మొలిసెనా అంటూ వలసల వేదనపై పాటలు పాడుకున్న దుస్థితి ఉండేది. కానీ తెలంగాణ రాష్ట్రం వచ్చి కేసీఆర్ గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రత్యేక శ్రద్ధ చూపి నెట్టంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి లాంటి పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు. దాదాపు రూ. 4 వేల కోట్లు ఖర్చు పెట్టి పెద్ద ఎత్తున చెక్ డ్యామ్‌లు నిర్మించి, చెరువులు బాగుచేసి పాలమూరు జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. ఈ ఇందువాసి గ్రామానికి కూడా నెట్టంపాడు నీళ్లను పారించింది బీఆర్ఎస్సే. 24 గంటల కరెంట్, రైతుబంధు ఇచ్చి ఆదుకున్నాం. దాంతో ఇందువాసి గ్రామం పత్తి, పొగాకు, మొక్కజొన్న విత్తన పంటలకు కేరాఫ్ అడ్రస్‌గా మారి, పెద్ద పెద్ద సీడ్ కంపెనీలు ఇక్కడికి వచ్చి రైతులతో ఒప్పందాలు చేసుకున్నాయి.గ్రామస్తులందరికీ పుష్కలంగా ఉపాధి దొరికింది. గతంలో కేటీఆర్ వచ్చినప్పుడు రోడ్డుపై కూలీలను పలకరిస్తే.. మేము కర్ణాటక నుంచి, కర్నూలు నుంచి గద్వాలకు కూలి పనుల కోసం వలస వచ్చామని చెప్పిన పరిస్థితి ఉండేది.పాలమూరు జిల్లా నుంచి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆనాటి రోజులు తెస్తా.. పాత రోజులు తెస్తా అన్నాడు. ఆయన చెప్పినట్లే పాలమూరుకు పాత వలసల రోజులు తీసుకొచ్చాడు. సాగునీరు రాక, కరెంట్ లేక, చేతినిండా కూలి దొరకక మళ్లీ వలసలు మొదలయ్యాయి. ఈ గ్రామంలో ఎవరిని కదిలించినా కరెంట్ రావడం లేదని, కరెంట్ పరిస్థితి ఘోరంగా మారిందని లబోదిబోమంటున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బాగుండేదని, ఇప్పుడు కనీసం 6-7 గంటల కరెంట్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మేం ఇక్కడికి వస్తుంటే మార్గమధ్యంలో మల్దకల్, అయిజలో రైతులు మా కారును ఆపి.. సార్, రేవంత్ రెడ్డిని గట్టిగా నిలదీయండి.. నేను రైతును, ఎనిమిది ఎకరాల్లో పంట వేస్తే కరెంట్ రాక నిలువునా ఎండిపోతోంది అని ఎంతో ఆవేదనతో మొరపెట్టుకున్నారు.

ఈ ప్రభుత్వం విద్యుత్ సరఫరాలో పూర్తిగా విఫలమైంది.ఆనాడు కేసీఆర్ పాలనలో బొంబాయి, దుబాయ్ పోయిన పాలమూరు బిడ్డలు తిరిగి సొంత గ్రామాలకు వచ్చి గౌరవంగా వ్యవసాయం చేసుకుని బతికారు. కానీ కాంగ్రెస్ పాలన రాగానే మళ్లీ వలసలు ప్రారంభమయ్యాయి. సీఎం సొంత జిల్లాలోని ఈ గ్రామం నుంచి 40 దళిత కుటుంబాలు పొట్టచేతపట్టుకుని కర్ణాటకకు వలసపోయే దుస్థితి వచ్చిందంటే రేవంత్ రెడ్డి సిగ్గుతో తలదించుకోవాలి, ప్రజలకు క్షమాపణ చెప్పాలి. నీ పాలనలో నీ జిల్లాలోని వలసకూలీలకు కూడా నువ్వు న్యాయం చేయలేకపోయావు. కేసీఆర్ గారు వలసపోయినోళ్లను వాపస్ తెస్తే, నువ్వు మాత్రం పాలమూరు బిడ్డలను మళ్లీ వలసలపాలు చేశావు. దీనికి ముమ్మాటికీ కరెంట్ ఇవ్వకపోవడం, నీళ్లు ఇవ్వకపోవడమే కారణం. నెట్టంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టుల్లో 24 గంటలు నడపాల్సిన మోటార్లను 8-9 గంటలే నడిపి నీళ్లు ఎత్తకపోవడం వల్ల చివరి ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోయి జనం వలసబాట పట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక పాలమూరు జిల్లాలో ఒక్క ఎకరానికైనా కొత్తగా సాగునీరు ఇచ్చారా? ఒక్క చెక్ డ్యామ్ కట్టారా? ఒక్క చెరువునైనా బాగుచేశారా? కేసీఆర్ కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాంటి ప్రాజెక్టులను, వాటి మోటార్లను కూడా నడపడం చేతకావడం లేదు. కల్వకుర్తి, నెట్టంపాడు, భీమాల్లో 24 గంటలు నడవాల్సిన మోటార్లను 7-8 గంటలే ఎందుకు నడుపుతున్నారు? ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ అసమర్థత తెచ్చిన కరువు. నీళ్లు ఎత్తకపోవడం, కరెంట్ ఇవ్వకపోవడం వల్ల పాలమూరుకు రేవంత్ రెడ్డి రూపంలో గ్రహణం పట్టింది. శ్రీశైలంలో నీళ్లున్నా ఐదు మోటార్లు నడపాల్సిన చోట రెండే మోటార్లు నడుపుతున్నారు. లో-వోల్టేజీతో రైతుల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి, బోర్ల నుంచి నీళ్లు రావడం లేదు. మంత్రులు తుమ్మల, పొంగులేటి ప్రజలను భయపెడుతూ 'ఎల్‌నినో' వల్ల కరువు వచ్చిందని సాకులు చెబుతున్నారు. ఎల్‌నినోకు బొగ్గు కొరతకు ఏం సంబంధం? బొగ్గు లేక కరెంట్ ఉత్పత్తి ఆగిపోయింది మీ చేతగానితనం వల్ల కాదా? ఇది ఎల్‌నినో కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ వైఫల్యం తెచ్చిన 'ఎల్-కాంగో' కరువు.పక్క రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా నది నీళ్లను 700 కిలోమీటర్లు తీసుకెళ్లి కుప్పంలో పారిస్తున్నాడు. వెలిగొండ ప్రాజెక్టును మొదలుపెట్టి రాయలసీమలో నీళ్లు పారిస్తూ జలహారతులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రాప్ హాలిడే లేదు.. కానీ తెలంగాణలో క్రాప్ హాలిడే ఎందుకు వచ్చింది? గోదావరి, కృష్ణా నదులు తెలంగాణ నుంచే కదా కిందికి పోవాలి.. తెలంగాణలో నీళ్లను ఒడిసిపట్టకుండా రేవంత్ రెడ్డి విడిచిపెట్టడం వల్లే కదా చంద్రబాబు ఒడిసిపట్టి 700 కిలోమీటర్లు తీసుకెళ్తున్నాడు..పక్కనే కృష్ణమ్మ పారుతున్నా మన ఇందువాసిలో నీళ్లు లేవు. కరెంట్ లేక మిరపతోటలు, పత్తి పంటలు ఎక్కడికక్కడ ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జలహారతులు నడుస్తుంటే, తెలంగాణలో రైతుల కన్నీటి హారతులు నడుస్తున్నాయి.కేసీఆర్ గారు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 80 శాతం పూర్తి చేసి, 50 టీఎంసీలు నింపుకునే రిజర్వాయర్లు, టన్నెళ్లు, పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు నిర్మించి సిద్ధం చేశారు.ప్యాకేజీ-3 లో మూడు నెలలు గట్టిగా పనిచేస్తే పూర్తయ్యే చిన్న పనిని మూడేళ్లయినా ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. ఆ పని పూర్తి చేసుంటే శ్రీశైలం నుంచి 50 టీఎంసీల నీళ్లు ఎత్తిపోసి పాలమూరు నెత్తిమీద కుండలా పెట్టుకునేవాళ్లం.. జిల్లాలో అసలు కరువు అనే మాటే ఉండేది కాదు. మీ చేతగానితనం, నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి వచ్చింది. కేసీఆర్ ఉన్నప్పుడు కరోనా మహమ్మారి వచ్చినా నీళ్లు ఆగలేదు, కరెంట్ ఆగలేదు, రైతుబంధు ఆగలేదు. రైతును కేంద్రంగా చేసుకుని పాలన సాగింది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దేవుడి మీద ఒట్టు పెట్టి రుణమాఫీ ఎగ్గొట్టింది, మూడు పంటల రైతుబంధు ఎగ్గొట్టింది, రైతుబీమాను రద్దు చేసింది.నిన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 17తో ఒక విషయం స్పష్టమైంది.. ప్రభుత్వం భయపెట్టడం కాదు, భరోసా కల్పించాలి. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడానికి ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి, పెట్టుబడి కోసం ముందస్తుగా రైతుబంధు నిధులు విడుదల చేయాలి. కరువు వస్తే కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చి, ఉపాధి హామీ పనిదినాలు పెంచి ఆదుకోవాలి. అంతేగానీ దిశానిర్దేశం లేకుండా ప్రజలను ఆందోళనకు గురిచేస్తే వలసలు పోక ఏం చేస్తారు?దసరా పండుగ పూట రేవంత్ సర్కార్ ప్రజల ఉసురు పోసుకుంటోంది. విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు 50 పైసలు పెంచారు. మహిళలకు బస్సుల్లో ఉచితం అంటూనే, పండుగ వేళ పురుషులకు టికెట్ ధరలను రెట్టింపు, మూడు రెట్లు పెంచి నిలువుదోపిడీ చేస్తున్నారని అన్నారు.

వ్యక్తిగత శత్రువులు ..రాజకీయాల్లో ప్రత్యర్థులు

మొదటిపేజీ తరువాయి...


కథనాలు అల్లడం మొదలుపెట్టారు. దర్యాప్తు సంస్థల భయం వల్లే ఆయన అనారోగ్యం డ్రామా ఆడుతున్నారంటూ రకరకాల ఊహాగానాలతో ప్రచారం చేయడం రాజకీయ నైతికత ఏ స్థాయికి దిగజారిందో చాటిచెప్పింది.అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బిఆర్ఎస్ సానుభూతిపరులు, కాంగ్రెస్ వ్యతిరేకులు డిజిటల్ హ్యాండిల్స్ సాగిస్తున్న ప్రచారం కూడా హద్దులు దాటుతోంది. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన పోస్టులు పెట్టడం, మార్ఫింగ్ ఇమేజ్‌లు, వికృతమైన కంటెంట్‌ను వ్యాప్తి చేయడం పరిపాటిగా మారింది. ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారంటూ ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్లలో పలు కేసులు సైతం నమోదయ్యాయి. న్యాయపరమైన చర్యలు హెచ్చరిస్తున్నప్పటికీ, డిజిటల్ వేదికలపై వైరం ఏమాత్రం తగ్గడం లేదు.ఈ రకమైన డిజిటల్ యుద్ధానికి ప్రధాన కారణం ఇరు పార్టీల సోషల్ మీడియా ఆర్మీలు నిర్వహిస్తున్న శైలేనని భావిస్తున్నారు. యూట్యూబ్ ఛానెళ్లు, ఎక్స్ , ఫేస్‌బుక్ , వాట్సాప్ గ్రూపుల ద్వారా కంటెంట్‌ను వైరల్ చేసే క్రమంలో లైకులు, వ్యూస్, రాజకీయాధిపత్యం కోసం ప్రత్యర్థులపై అత్యంత నీచమైన పదజాలాన్ని ఉపయోగిస్తున్నారు. పాలనాపరమైన లోపాలు, విద్యుత్ సంక్షోభం, నిరుద్యోగం, ధరణి లేదా హైడ్రా వంటి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన చోట,

ఎన్నికల ముందు
ఇరాన్‌పై దాడి?..

మొదటిపేజీ తరువాయి...

ద్రిక్తతలకు దారితీసే కీలక పరిణామం ఒకటి తెరపైకి వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాల్లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్య చేపట్టే అంశంపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మధ్య గత వారం ఈ కీలక సంభాషణలు జరిగినట్లు పలువురు అధికారులు తెలిపారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలను కమ్ముకునేలా చేస్తోంది. ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ తన అణు కార్యక్రమానికి సంబంధించిన కొన్ని భాగాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉందని నెతన్యాహు, ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పికాక్స్ మౌంటెన్' వంటి ప్రదేశాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక చర్యను పునఃప్రారంభించేందుకు నెతన్యాహు తీవ్ర ఆసక్తి చూపారని, దీనిపై ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ట్రంప్ ఆయనకు చెప్పినట్లు ఒక అమెరికా అధికారి పేర్కొన్నారు. అయితే, ట్రంప్ దీనిపై ఎటువంటి కచ్చితమైన హామీ ఇవ్వలేదని సమాచారం.మొదట ఈ ఆలోచనకు ట్రంప్ సానుకూలంగా ఉన్నప్పటికీ, తన సలహాదారులతో సంప్రదించిన తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సెంట్రల్ కమాండ్ నాయకత్వం సైనిక చర్యకు మొగ్గు చూపగా, ట్రంప్ సలహాదారుల్లో మెజారిటీ సభ్యులు మాత్రం ప్రస్తుతానికి ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని కొనసాగించడమే మేలని సూచించినట్లు సమాచారం. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేయబోమని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడానికి ముందే ఈ చర్చలు జరగడం గమనార్హం.

ఓటు నమోదుకు మరో అవకాశం..
సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన



సద్వినియోగం చేసుకుని ఫారమ్-6 దరఖాస్తును సమర్పించి తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సీఈవో సూచించారు.అదేవిధంగా, ప్రస్తుతం విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితాలో ఎవరి పేరు కనిపించకపోయినా, జాబితాలో పేరు లేనివారు వెంటనే ఫారమ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ స్పెషల్ క్యాంప్‌ల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారందరి పేర్లను వచ్చే నవంబర్ 9న విడుదల చేయబోయే తుది ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లుగా సీఈవో సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. ఈ సదావకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు

2047నాటికి3ట్రిలియన్
డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

నాయకుల వ్యక్తిగత బలహీనతలు లేదా వ్యక్తిగత జీవితాలే డిజిటల్ వేదికల్లో ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. తెలంగాణ సమాజం చైతన్యవంతమైన రాజకీయ పోరాటాలకు నిలయం. ఉమ్మడి రాష్ట్రంలో హుందాగా సాగిన సిద్ధాంత రాద్ధాంతాలు, హక్కుల పోరాటాల స్థానంలో ఇప్పుడు క్షుద్ర రాజకీయాలు చోటుచేసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే చేటు తెస్తోంది. నాయకుల మధ్య శత్రుత్వం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా వ్యక్తిగత కక్ష సాధింపుగా రూపాంతరం చెందుతుండటంతో, ద్వితీయ శ్రేణి కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో పరస్పరం దాడులకు తెగబడే వాతావరణం ఏర్పడుతోంది. ఈ ధోరణికి తక్షణమే అడ్డుకట్ట పడకపోతే, ప్రజా సమస్యలు గాలికి కొట్టుకుపోయి కేవలం బురదజల్లుడు రాజకీయాలే రాజ్యమేలుతాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. తమ పార్టీ సోషల్ మీడియా విభాగాలను అదుపులో ఉంచుకోవాల్సిన ప్రాథమిక బాధ్యత అగ్రనాయకత్వానిదే. వ్యక్తిగత దూషణలను, వికృతమైన డిజిటల్ పోస్టులను ఖండిస్తూ సీనియర్ నేతలు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పుడే తెలంగాణ రాజకీయాల్లో పోగొట్టుకున్న హుందాతనాన్ని మళ్లీ పునరుద్ధరించడం సాధ్యమవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

రైతులకు 24 గంటలకరెంటు ఇవ్వాలి
చెల్వూరులో జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ధర్నా

జయశంకర్ భూపాలపల్లి జిల్లా: రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్వూరు గ్రామంలో జాతీయ రహదారిపై భూపాలవల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ధర్నాలో గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం ఐదు నుంచి ఆరు గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరైన సమయంలో విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని, పొలాల్లో భూమి బీటలు వారుతోందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఇతర పార్టీ శ్రేణులు పాల్గొని రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు.



పత్తి రైతుకు ఎల్‌నినో దెబ్బ
వర్షాభావంతో ఎదగని పంట పెట్టుబడి కూడా రాని పరిస్థితి



కర్నూలు: తెల్లబంగారంపై ఆశలు పెట్టుకున్న రైతుకు ఈ ఏడాది ఎల్‌నినో దెబ్బ నిరాశను మిగిల్చింది. తొలకరి వర్షాలను నమ్ముకుని పత్తి విత్తనాలు వేసిన రైతులకు ఆ తర్వాత సరైన వర్షాలు కురవకపోవడంతో పంట ఎదుగుదల మందగించింది. మొక్కలు గిడసబారడం, కాయలు తగ్గడం, పూత రాలిపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. కర్నూలు జిల్లాలో పత్తి ప్రధాన వర్షాధార పంట. ఖరీఫ్‌లో సాధారణంగా 5.92 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా ఈ ఏడాది 5.48 లక్షల ఎకరాల్లో వేశారు. విత్తిన సమయంలో వర్షం పడినా ఆ తర్వాత కీలకమైన దశల్లో తేమ అందకపోవడంతో మొక్కల ఎదుగుదల నిలిచిపోయింది. ఈ సమయంలో వర్షాలు లేకపోవడంతో పూత నిలవకపోవడం, కాయల సంఖ్య తగ్గడం, వచ్చిన కాయలు కూడా పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. సెప్టెంబరు 12 నాటికి జిల్లాలో 2,69,975 ఎకరాల పంటలు తేమ ఒత్తిడికి గురైనట్లు అధికారులు గుర్తించారు.భారీగా తగ్గనున్న దిగుబడి: పత్తి సాగులో విత్తనాలు, దుక్కులు, ఎరువులు, కలుపు నివారణ, పురుగుమందులు, ఇతర ఖర్చులు కలిపి ఎకరాకు రూ.30 వేలకుపైగా ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. గత ఖరీఫ్‌లో అనేక ప్రాంతాల్లో సగటు దిగుబడి ఆరు క్వింటాళ్లు. ఈ ఏడాది ప్రారంభం నుంచే వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో దిగుబడి మరింత తగ్గే ప్రమాదం కనిపిస్తోంది. వర్షాభావంతో దెబ్బతిన్న పత్తి పంటను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. కౌలురైతుపై రెట్టింపు భారం: భూమి సొంతం కాకపోవడంతో ఎకరాకు వేలాది రూపాయలు కౌలు చెల్లించి సాగు ప్రారంభించిన కౌలు రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు కూడా భరించాల్సి వస్తోంది. ఈ ఏడాది వర్షాభావంతో కౌలు, పెట్టుబడి రెండూ రాబట్టుకోవడం కష్టంగా మారింది. పంట చేతికందకపోతే కౌలు చెల్లించేందుకు మరో అప్పు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిపైనా ప్రభావం: ఆదోని మార్కెట్ యార్డుకు గతేడాది ఆరు లక్ష?ల పత్తి బేళ్లు వచ్చాయి. ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుతం మూడు లక్ష?ల బేళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పత్తి దిగుబడులు రాకపోవడంతో ఆదోని మార్కెట్ బోసిపోయింది. అవసరమైన బేళ్లు రాకపోవడంతో కొన్ని పరిశ్రమలు మూతపడే అవకాశం కనిపిస్తోంది. దీంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధి కూడా తగ్గనుంది.

రీ సర్వే ద్వారా భూ సమస్యల శాశ్వత పరిష్కారం

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 14: ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం చందనావూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మండల తహసిల్దార్, బి-విభాగం పర్యవేక్షకులు, లక్షెట్టిపేట మండలం లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఎ.డి., మండల తహసిల్దార్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ భూ రికార్డుల వివరాలను పరిశీలించడం, సంబంధిత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. భూముల రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని, గ్రామస్థుల భాగస్వామ్యంతో సర్వే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పాత భూ రికార్డులలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భూముల విస్తీర్ణం, హద్దులు, యాజమాన్య వివరాలకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రీ-సర్వే ద్వారా ప్రతి భూమిని క్షేత్రస్థాయిలో కొలిచి, హద్దులను సాంకేతిక పరికరాల సహాయంతో వాస్తవ విస్తీర్ణాన్ని నిర్ధారించి సంబంధిత రికార్డులు, మ్యాపులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల సరిహద్దులలో ప్రభుత్వ భూములు, ఇతర భూముల ఆక్రమణలకు సంబంధించిన సమస్యలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ-సర్వే నిర్వహించే తేదీకి సంబంధించి భూయజమానులకు ముందుగానే నోటీసులు అందజేయడం జరుగుతుందని, నోటీసులో పేర్కొన్న తేదీన భూయజమానులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండాలని, వాస్తవ హద్దులను సర్వే సిబ్బందికి చూపించి, రికార్డులలో నమోదైన విస్తీర్ణం, క్షేత్రస్థాయిలో ఉన్న విస్తీర్ణాన్ని పరిశీలించుకోవాలని తెలిపారు. తద్వారా భూముల హద్దుల విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించడంతో పాటు, భూముల యాజమాన్య వివరాలను స్పష్టంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ హరిత




జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: భూ సమస్యలను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు.బుధవారం కౌటాల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు, రికార్డు గది, భూభారతి ఫైళ్లను పరిశీలించారు.సిబ్బంది ఎక్కువగా ఉన్నందున దరఖాస్తుల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, రీ సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, సర్వేకు ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని సూచించారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను 100 శాతం పూర్తి చేయాలని, అర్హులందరి పేర్లు ఉండాలని, మ్యాపింగ్ కాని, అన్మ్యాప్డ్ జాబితాలోని ఓటర్లకు నోటీసులు జారీ చేసి ధృవపత్రాలు స్వీకరించాలని, ఈ నెల 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహించి ఫారం-6 దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు.కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ హరిలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల ఎంపిక పారదర్శకంగా జరగాలి

ధ్రువపత్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

కలెక్టర్ కె.హరిత





జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ఐసీడీఎస్ పరిధిలో ఉన్న ఐదు ప్రాజెక్టుల్లో ఖాళీ పోస్టుల భర్తీకి భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నందున, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణితో కలిసి ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 8న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన ధ్రువపత్రాలను సీడీపీవోలు, సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

అర్హతలపై ప్రత్యేక దృష్టి

దరఖాస్తుదారుల విద్యార్హతలు, వయసు, స్థానికత, రిజర్వేషన్‌కు సంబంధించిన వివరాలతోపాటు వితంతువులు, అనాథలు, దివ్యాంగులకు సంబంధించిన ధ్రువపత్రాలను సైతం నిశితంగా పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిమజాతి కోలాం సంఘం మండల అధ్యక్షుడిగా సిడాం భీంరావు



జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 14: కోలాం ప్రజల అభివృద్ధికి కృషి చేస్తా.. నాపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు ఆదిమజాతి కోలాం సంఘం మండల అధ్యక్షుడిగా సిడాం భీంరావు ఎంపికయ్యారు. కోలాం తెగ అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా సంఘం తరఫున పనిచేసేందుకు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసిన సంఘం నాయకులకు, పెద్దలకు, సభ్యులకు సిడాం భీంరావు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సిడాం భీంరావు మాట్లాడుతూ.. ఆదిమజాతి కోలాం ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కోలాం తెగ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని చెప్పారు.

కోలాం ప్రజల అభ్యున్నతికి కృషి

ఆదిమజాతి కోలాం తెగ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించడంతో పాటు, యువతకు విద్యా, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని సిడాం భీంరావు తెలిపారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, సంఘాన్ని బలోపేతం చేసేందుకు నాయకులు, సభ్యుల సహకారంతో ముందుకు సాగుతానన్నారు.కోలాం ప్రజల ఐక్యతకు ప్రాధాన్యమిస్తూ, సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కోలాం తెగ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దసరా కానుక

నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన సర్పంచ్ ఆనందరావు



జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 14: దసరా పండుగ నేపథ్యంలో కెరమెరి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ పెందోర్ ఆనందరావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులకు వండుగ కానుకగా నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ నందర్భంగా సర్పంచ్ ఆనందరావు మాట్లాడుతూ.. గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. వారి సేవలను గుర్తిస్తూ, పండుగ వేళ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా దసరా జరుపుకోవాలనే ఉద్దేశంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య కార్మికులకు సహకరిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని కోరారు.దసరా పండుగ సందర్భంగా తమను గుర్తించి నిత్యావసర సరుకులు అందజేసిన సర్పంచ్‌కు గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అధికారిక కార్యకలాపాలలో తెలుగు భాష వినియోగాన్ని విస్తృతం చేయాలి

న.హ. చట్టం క్రింద నిర్ణీత గడువులో పారదర్శకంగా సమాచారం అందించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 14: ప్రభుత్వ కార్యాలయాలలో అధికారిక కార్యకలాపాలను వీలైనంత వరకు తెలుగులోనే నిర్వహిస్తూ, సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలు, పథకాలు, అధికారిక సమాచారాన్ని సులభంగా అర్థమయ్యే భాషలో అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన అధికార భాష అమలు సమావేశం, సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ అధికారిక కార్యకలాపాలలో తెలుగు భాష వినియోగాన్ని పెంపొందించాలని తెలిపారు. మన భావాలను వ్యక్తపరచడానికి పుట్టినప్పటి నుంచి ఉపయోగించే మాతృభాష తెలుగు అని, ప్రతి రంగంలోనూ తెలుగు భాష వినియోగాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. "దేశ భాషలందు తెలుగు లెస్స" అనే గొప్పతనాన్ని గుర్తుచేస్తూ, మన భాషను కాపాడుకోవడం, భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు, అధికారుల నామఫలకాలు, హోదాలు, హాజరు రిజిస్టర్లు, సెలవు దరఖాస్తులు, కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు,, నిబ్బందికి సంబంధించిన ఇతర అధికారిక పత్రాలలో వీలైనంత వరకు తెలుగు భాషను ఉపయోగించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో నిర్వహించే కార్యక్రమాలు ప్రజలకు అర్థమయ్యే భాషలో ఉండాలని, క్షేత్రస్థాయి కార్యాలయాల వరకు అధికారిక కార్యకలాపాలలో తెలుగు వినియోగం పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అర్థమయ్యే భాషలో సమాచారాన్ని అందించడం ద్వారా తెలుగు భాష అభివృద్ధికి తోడ్పాటు అందించాలని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ తెలుగు భాష వినియోగం క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు తమ రోజువారీ విధుల నిర్వహణలో తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలలో తెలుగు భాషను విస్తృతంగా ఉపయోగించాలని, సమాచార హక్కు చట్టం క్రింద అందించే సమాధానాలను కూడా సాధ్యమైనంత వరకు తెలుగులో అందించాలని తెలిపారు.

సమాచార హక్కు చట్టం పారదర్శకంగా నిర్వహించాలి

సమాచార హక్కు చట్టం వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం--2005 ప్రకారం దరఖాస్తుదారులకు నిర్ణీత గడువులో సమాచారాన్ని అందిస్తూ పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని తెలిపారు. సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు సేవలందించడమే ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యతని, సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని అందించడం అధికారుల విధి అని తెలిపారు. దరఖాస్తులో కోరిన సమాచారం తమ శాఖకు సంబంధించనప్పుడు, చట్టంలోని నిబంధనల ప్రకారం సంబంధిత శాఖకు దరఖాస్తును బదిలీ చేసి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని తెలిపారు.జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి హృదయ స్పందన వంటిదని, చైతన్యవంతమైన ప్రజలతోనే ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పనితీరు, నిర్ణయాలు, అందుబాటులో ఉన్న సమాచారం గురించి తెలుసుకునే అవకాశాన్ని సమాచార హక్కు చట్టం కల్పిస్తుందని తెలిపారు. ఈ చట్టంపై అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండి, దరఖాస్తులను బాధ్యతాయుతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు సమాచారాన్ని పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించాలని, సమాచార హక్కు చట్టం క్రింద దరఖాస్తు అందిన 30 రోజులలోగా సంబంధిత సమాచారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుపై తీసుకున్న చర్యల గురించి దరఖాస్తుదారులకు తెలియజేయాలని, చట్టప్రకారం అందించదగిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం క్రింద వచ్చే దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, చట్టబద్ధమైన విధానాలను పాటించాలని తెలిపారు. అనంతరం సమాచార హక్కు చట్టం, సెక్షన్లపై అధికారులకు అవగాహన కల్పించి, సమాచార హక్కు చట్టం పారదర్శకంగా ,జవాబుదారీతనంతో అమలు చేస్తామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు జిల్లాలో బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని తెలంగాణ గెజిటెడ్ అధికారుల ప్రతినిధులతో కలిసి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మీ-సేవ కేంద్రాల్లో జిల్లా అధికారుల తనిఖీలు..

ప్రజలకు సకాలంలో సేవలందించాలని

నిర్వాహకులకు సూచన



జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: దహెగాం మండలంలోని మీ-సేవ కేంద్రాలను జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఈడీఎం) గౌతమ్ రాజ్, జిల్లా మీ-సేవ మేనేజర్ (డీఎం) గోపతి ప్రశాంత్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలు, దరఖాస్తుల స్వీకరణ, వాటి పరిష్కార ప్రక్రియ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.మీ-సేవ కేంద్రాల పనితీరును సమీక్షించిన అధికారులు.. ప్రజలకు ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని నిర్వాహకులకు సూచించారు. కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. కేంద్రాల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కుటుంబసమేతంగా ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్న జగిత్యాల అదనపు కలెక్టర్ ప్రసూనాంభ



జగిత్యాల జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 14: జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంభ బుధవారం కుటుంబ సమేతంగా కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులచే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అదనపు కలెక్టర్ స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మల్యాల తహశీల్దార్ శ్రీనివాస్, కొడిమ్యాల తహశీల్దార్ నరేశ్, ఆలయ ఏఈఓ హరిహరనాథ్, ప్రధాన అర్చకులు మారుతి ప్రసాద్, స్థానాచార్యులు కపీందర్, ఆలయ పరిశీలకులు అశోక్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబాసాహెబ్ ఆశయాలను కొనసాగించాలి

వాంకిడిలో ఘనంగా ధమ్మ చక్రప్రవర్తన్ దివస్

జననినాదం,వాంకిడి,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. దేశంలో అణగారిన వర్గాల స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం కోసం బాబాసాహెబ్ చూపిన బౌద్ధ ధమ్మ మార్గాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం నిర్వహించిన 70వ ధమ్మ చక్ర ప్రవర్తన్ దివస్ వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. తొలుత గౌతమ బుద్ధుడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ.. 1956 అక్టోబరు 14న నాగ్‌పూర్‌లోని దీక్షాభూమిలో బౌద్ధ భిక్షువు చంద్రమణి మహాస్థవిరుల చేతుల మీదుగా డాక్టర్ అంబేద్కర్ బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించారని గుర్తుచేశారు. అనంతరం ఆయనతోపాటు లక్షలాది మంది అనుచరులు బౌద్ధ ధమ్మ దీక్ష తీసుకున్నారని తెలిపారు. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా ప్రతి ఏటా అక్టోబరు 14న దేశవ్యాప్తంగా ధమ్మ చక్ర ప్రవర్తన్ దివస్‌ను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అశోక విజయదశమికి కూడా ఈ



రోజుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు.మాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్నాలే నారాయణ మాట్లాడుతూ.. దేశంలో అణగారిన వర్గాలకు స్వేచ్ఛ, సమానత్వం, శాంతి, ఆత్మగౌరవం లభించాలనే లక్ష్యంతోనే బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధ ధమ్మాన్ని స్వీకరించి, ప్రజలకు ఆ మార్గాన్ని చూపించారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వాంకిడి మండల భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ఉపాధ్యక్షులు దుర్గం సునీల్‌కుమార్, దుర్గం హంసరాజ్, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, వర్షావాస్ కమిటీ అధ్యక్షుడు దుర్గం శ్యామ్‌రావు, రమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు గంగుబాయి, బౌద్ధ సమాజ అధ్యక్షుడు శ్యామ్‌రావు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

కొమురం భీం వర్ధంతి ఏర్పాట్ల పరిశీలన

జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 14: ఆదివాసీల హక్కుల కోసం నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుడు, ఆదివాసీల ఆరాధ్య దైవం కొమురం భీం 86వ వర్ధంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్ తెలిపారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఈ నెల 26న నిర్వహించనున్న వర్ధంతి వేడుకలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లను ఆయన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు.లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లుఆదివాసీల హక్కుల సాధన కోసం 'జల్, జంగల్, జమీన్' నినాదంతో పోరాడిన కొమురం భీం ఆశయాలను స్మరించుకుంటూ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు రాజేశ్వర్ పేర్కొన్నారు. గత సంవత్సరాల కంటే ఈసారి వేడుకలను మరింత ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా



ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సలహాదారు సిదం జగన్నాధ్ రావు, కార్యదర్శి మూట ఎల్లయ్య, భూత బాపూరావు, ప్రవీణ్, సోనేరావు, లక్ష్మణ్, యశ్వంతరావు, జంగు తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకం, వర్మీ కంపోస్ట్‌తో అదనపు ఆదాయం

రైతులు ప్రత్యామ్నాయ జీవనోపాధులపై దృష్టి సారించాలి: కలెక్టర్ కె. హరిత

జననినాదం,కౌటాల/ ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: పెరటి కోళ్ల పెంపకం, వర్మీ కంపోస్ట్ తయారీ వంటి ప్రత్యామ్నాయ జీవనోపాధుల ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ కె. హరిత అన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.కౌటాల మండలంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలవుతున్న కాలానుకూల వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ పొందిన రైతులు, వర్మీ కంపోస్ట్ తయారీలో విజయవంతంగా ముందుకు సాగుతున్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారి అనుభవాలు, వాటి ద్వారా పొందుతున్న ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులు వ్యవసాయంతో పాటు



ప్రత్యామ్నాయ జీవనోపాధులను చేపట్టి అదనపు ఆదాయం పొందేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఈ తరహా కార్యక్రమాలు రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు స్థిరమైన వ్యవసాయానికి, గ్రామీణ జీవనోపాధుల బలోపేతానికి దోహదపడతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో నీతి ఆయోగ్ జిల్లా సమన్వయకర్త డా. బాలరాజు రాజారాం, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రతాప్, కౌశిక్, అడ్మిన్ వినయ్, ఎస్ టు పోషన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయి లిఖిత, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు ఉచిత విద్యుత్ మీటర్లు!

పీఎం జుగా పథకంతో గిరిజన గ్రామాల్లో వెలుగులు
ఇప్పటివరకు 597 దరఖాస్తులు.. మరో 100 వచ్చే అవకాశం..
అర్హులందరికీ విద్యుత్ సౌకర్యం కల్పించడమే లక్ష్యం: ఏఈ రమేష్



ఆదిమ గిరిజనుల ఇళ్లలో విద్యుత్ వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జుగా పథకం ద్వారా అర్హులైన గిరిజన కుటుంబాలకు ఉచిత విద్యుత్ మీటర్లు అందించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యాన్ని విస్తరించడంతోపాటు, అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.597 దరఖాస్తులు.. మరో 100 వచ్చే అవకాశంకెరమెరి మండలంలో ఇప్పటివరకు పీఎం జుగా పథకం కింద 597 దరఖాస్తులు అందినట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ తెలిపారు. మరో 100 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హులైన గిరిజన కుటుంబాలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యుత్ సౌకర్యం లేని గిరిజన ఆవాసాలకు విద్యుత్ అందించేందుకు శాఖాపరంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.గిరిజన గ్రామాల్లో ప్రత్యేక చర్యలుమండలంలోని పరందోలి, మెట్ట పిప్రి, హోట్టి, కొఠారి, బాబేఝరి తదితర గిరిజన గ్రామాల్లోఇప్పటికే మెరుగైన విద్యుత్ సేవలకు కృషి చేయడం జరిగింది. ఈపథకం పూర్తి స్థాయిలో అమలుకు అధికారులు దృష్టి సారించారు. గ్రామాల్లో పర్యటిస్తూ పథకం ప్రయోజనాలను వివరిస్తున్నారు. అర్హులైన గిరిజన కుటుంబాలు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు సైతం విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.**ఆధార్, రేషన్ కార్డుతో దరఖాస్తు** పీఎం జుగా పథకం కింద ఉచిత విద్యుత్ మీటర్లు పొందేందుకు అర్హులైన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అర్హత కలిగిన ప్రతి గిరిజన కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు. పథకం ద్వారా గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం మెరుగుపడటంతోపాటు, ఆయా కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్రమశిక్షణతో క్రీడాస్ఫూర్తిని చాటాలి

సీఐ రమేష్

జననినాదం,జైనూర్ 14:క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడుతూ క్రీడాస్ఫూర్తిని చాటాలని జైనూర్ సీఐ రమేష్ అన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన వరిశీలించి క్రీడాకారులతో మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ, పరస్పర సహకారంతో ముందుకు సాగాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఓటమికి కుంగిపోకుండా, గెలుపుతో అహంకారానికి తావివ్వకుండా నిరంతర సాధనతో ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు. జట్టు విజయానికి ప్రతి క్రీడాకారుడు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీటీఐలు ఆత్రం ధర్మారావు, కనక ఆనంద్ పాల్గొన్నారు

బతుకమ్మ పండుగ సందర్భంగా అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట 14: బతుకమ్మ పండుగ సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులకు ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, ఎర్రచెరువు, మచ్చవానికుంటా, నర్సాపురం చెరువు, రంగదాంపల్లి చెరువుల వద్ద సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను జిల్లాలో క్రితం కంటే ఈ ఏడాది అంగరంగ వైభవంగా సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కోమటి చెరువు వద్ద పారిశుద్ధ్యం నిర్వహణ లోపాలు లోపాలు ఉండడం వల్ల నిర్వహణ ఇన్చార్జిలు, టూరిజం డిపార్ట్మెంట్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర పండుగ బతుకమ్మ అని సద్దుల బతుకమ్మ వరకు పూర్తిస్థాయిలో పారిశుధ్యంతో పాటు నిర్వహణ సంబంధించి



అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. టూరిజం అధికారి కలెక్టరేట్ కి రావాలని టూరిజం శాఖ సిబ్బందిని హెచ్చరించారు. టూరిజం మరియు మున్సిపల్ అధికారులు సమన్వయంతో పగడ్బందీగా కోమటి చెరువు పై ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట మున్సిపల్ డిఈ ప్రేరణ, సిబ్బంది, పోలీస్ అధికారులు, స్థానిక వార్డు ఆఫీసర్లు తదితరులు ఉన్నారు.

దండారి ఉత్సవాలకు నిధులు

ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌కు సార్మెడీల సన్మానం

జననినాదం,జైనూర్ 14: ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన ఎత్మసూర్ దేవతల దండారి ఉత్సవాల నిర్వహణకు నిధుల మంజూరుకు కృషి చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల రాయిసెంటర్ సార్మెడీలు బుధవారం ఘనంగా సన్మానించారు. జైనూర్ మండల కేంద్రంలో శాలువాతో సత్కరించారు. ఉత్సవాలకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దండారి, గుస్సాడీ ఉత్సవాలను తరతరాలుగా నిర్వహిస్తూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్న కళాకారులను గుర్తించాలన్నారు. రాయిసెంటర్ సార్మెడీలు దండారి కళాకారుల వివరాలతో జాబితా రూపొందించాలన్నారు. దసరా పండుగ ముగిసిన వెంటనే



పిల్లలను పాఠశాలలకు పంపించే బాధ్యతను సార్మెడీలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు, సార్మెడీలు మెస్రం బాది రావు, గెడం గణపత్, సర్పంచులు తొడసం రాజేందర్, జనేరావు, ఆత్రం మీరా, జాలీంషా, ఆత్రం శేషు, నాయకులు మెస్రం అంబాజీరావు, పూర్క భాపురావు, చాహకటి రాజేశ్, నాగోరావు, పార్చకి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


రహదారి అధ్వానం.. భక్తులకు అవస్థలు..!

సుంగపూర్ దేవస్థానానికి వెళ్లాలంటే ఇబ్బందులే
పెద్దదోబా నుంచి రహదారి నిర్మించాలని గ్రామస్థుల వినతి

జననినాదం,సిర్పూర్(యు) 14: సుంగపూర్ దేవస్థానానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంగిడి గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దదోబా గ్రామం నుంచి దేవస్థానానికి వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు, భక్తులు అధికారులను కోరుతున్నారు. సిర్పూర్(యు), జైనూర్, లింగాపూర్, నార్నూర్, కెరమెరి మండలాలతో పాటు తెలంగాణ, మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో సుంగపూర్ దేవస్థానాన్ని దర్శించుకుంటారు. ముఖ్యంగా దసరా, దీపావళి పండుగల సమయంలో భక్తుల రద్దీ పెరుగుతుంది. అయితే దేవస్థానానికి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో భక్తులు ప్రయాణంలో అవస్థలు పడుతున్నారు. వాహనాలపై వెళ్లేవారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు.

రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి...

దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పెద్దదోబా నుంచి సుంగపూర్ దేవస్థానం వరకు రహదారిని అభివృద్ధి చేయాలని



గ్రామస్థులు కోరుతున్నారు. పండుగల సమయంలో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని కోరుతున్నారు.ఈ మేరకు పెద్దదోబా పటేల్ కుంరం సోము వారసుడు కుంరం సోనేరావు, కుంరం పూసం, కుంరం రాంసావు, జంగు, ఆత్రం నాగు, పావర్‌గూడ రాజు పటేల్, కముగూడ ఆత్రం గుండా పటేల్, ఆత్రం జగనంత పటేల్, బాబ్జీపేట సోయం రాజు, కత్తిగూడ మాదవి విశ్వనాథ్ పటేల్‌తో పాటు పంగిడి, పావర్‌గూడ, బాబ్జీపేట గ్రామాల సర్పంచులు, గ్రామపెద్దలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదు!

కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక ఆందోళన
మద్దతు తెలిపిన తుడుందెబ్బనాయుకులు



జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆయుష్ వైద్యులు కలెక్టరేట్ ఎదుట నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు వైద్య సేవలందించిన తమకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి...

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేడర్ ఫిక్సేషన్ అమలు చేసి 100 శాతం గ్రాస్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ఉద్యోగులందరినీ స్టేట్ హెల్త్ సొసైటీ (ఎస్‌హెచ్ఎస్)



పరిధిలో కొనసాగించాలని కోరారు. స్పర్శ్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించడంతోపాటు ఐదు శాతం ఇంక్రిమెంట్, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ ఇవ్వాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి...

ఉద్యోగి మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా లేదా బీమా సదుపాయం కల్పించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతోపాటు ఈహెచ్ఎస్/ ఈఎస్ఐ వైద్య సదుపాయాలు అందించాలన్నారు. ప్రతి నెల ఐదో తేదీలోగా వేతనాలు చెల్లించాలని, తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఏరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. జీవో నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాలు చెల్లించి తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

టీబీ లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయొద్దు

సర్పంచ్ కుమ్ర దేవ్ షావ్ పటేల్

జననినాదం,జైనూర్ 14: టీబీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని మన్‌కుగూడ సర్పంచ్ కుమ్ర దేవ్ షావ్ పటేల్ సూచించారు. జైనూర్ మండలం మన్‌కుగూడ గ్రామపంచాయతీలో బుధవారం ఉచిత టీబీ నిర్ధారణ, హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రివేళల్లో జ్వరం, బరువు తగ్గడం, ఛాతినొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశా కార్యకర్తలను సంప్రదించాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, టీబీ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. గ్రామపంచాయతీలో తొలిసారిగా ప్రత్యేక శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హరిచంద్, కారోబార్ కుమ్ర విష్ణు, ఆశా కార్యకర్తలు రంబా, పార్వతి, జంగుబాయి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా సమగ్ర ప్రణాళిక

రాయచోటి, అక్టోబర్ 14:అన్నమయ్య జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షపాత లోటు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అన్నమయ్య జిల్లాలో రైతులు పంటల వైవిధ్యాన్ని పాటిస్తూ, బెట్టను తట్టుకునే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటూ రైతుల ఆదాయానికి భరోసా కల్పించేందుకు వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ సమన్వయంతో రూపొందించిన సెప్టెంబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు అమలు చేయనున్న సమగ్ర వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.బుధవారం మదనపల్లె కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రచార కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షపాత లోటు కారణంగా పంటలు దెబ్బతినకుండా రైతులు అందుబాటులో ఉన్న భూమి, నేల స్వభావం, నీటి వసతి ఆధారంగా తగిన పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.పంటల వైవిధ్యంతో వర్షాభావాన్ని ఎదుర్కోవాలి.జిల్లాలో సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణం 46,055 హెక్టార్లు కాగా, సెప్టెంబర్ 15 నాటికి 32,751 హెక్టార్లలో పంటలు సాగయ్యాయని, ఇంకా 13,304 హెక్టార్లలో సాగుకు అవకాశం ఉందని కార్యాచరణ ప్రణాళికలో పేర్కొన్నారు. సాగు చేయని భూముల్లో వర్షం పడినప్పుడు నేరుగా లేదా విత్తన గుళికల ద్వారా బెట్టను తట్టుకునే పంటలను సాగు చేయాలని సూచించారు.నజ్జ, కొర్ర, నువ్వులు, ఆవాలు, ఉలవలు, అలసందలు, అనుములు, గోరుచిక్కుడు, కుసుమలు వంటి పంటలతో పాటు అనుకూల పరిస్థితుల్లో ఇతర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా పంటల వైవిధ్యాన్ని పెంచుకోవాలని రైతులకు సూచించారు.ప్రధాన పంటలతో పాటు అంతర పంటలకు ప్రాధాన్యత.ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ, కంది, వరి, కూరగాయల పంటల్లో నీటి ఎద్దడి పరిస్థితులు ఏర్పడినప్పుడు వ్యవసాయ శాఖ సూచించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని ప్రణాళికలో సూచించారు.

ఏక పంట విధానానికి బదులుగా ప్రధాన పంటలతో పాటు అనుకూలమైన అంతర పంటలు, సరిహద్దు పంటలు సాగు చేయడం ద్వారా భూమి వినియోగాన్ని మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు.ఉలవలు, వేరుశనగ వంటి ప్రధాన పంటలతో పాటు అనుములు, అలసందలు, నువ్వులు, గోరుచిక్కుడు, బెండ,



గోంగూర తదితర పంటలను అంతర పంటలుగా సాగు చేయాలని సూచించారు. పంటల్లో చీడపీడల నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, అవసరాన్ని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు..ఉద్యాన పంటల్లోనూ జీవవైవిధ్యానికి ప్రోత్సాహంటమోటా పంటలో ఆకుకూరలు, ఉల్లి, ముల్లంగి, గోరుచిక్కుడు వంటి అనుబంధ పంటలను సాగు చేయాలని, మామిడి తోటల్లో ఉలవలు, పెసలు, మినుములు, కంది, నువ్వులు తదితర జీవవైవిధ్య పంటలను విత్తుకోవాలని కార్యాచరణ ప్రణాళిక సూచిస్తోంది. దీనివల్ల భూమిపై పచ్చదనం పెరగడంతో పాటు సేంద్రియ పదార్థం, సేంద్రియ కర్బనం పెరుగుదలకు దోహదపడుతుంది.విత్తన గుళికల ద్వారా పంటల సాగు, ఘన జీవామృతం వినియోగం, పండ్ల తోటల్లో అంతర పంటల సాగు వంటి పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే సహకారంతో ఇంటింటా పెరటి తోటల ఏర్పాటును ప్రోత్సహిస్తూ, ఏడాది పొడవునా కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రణాళికలో పేర్కొన్నారు.సాగుకు అనుకూలం కాని బీడు భూముల్లో పశుగ్రాస పంటల సాగు, అర్ధచంద్రాకార నమూనాల ఏర్పాటు వంటి కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నష్టాలను తగ్గించుకొని, భూమిని పంటలతో కప్పి ఉంచేలా సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సాధికార సంస్థ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హరిప్రియ, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం వెంకట మోహన్, ఏడీఏ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

కరీంనగర్ నగరపాలక సంస్థ ను అగ్రస్థానంలో నిలుపుతాం

మేయర్ కొలగాని శ్రీనివాస్

21 వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమి పూజ

కరీంనగర్ 14: విలీన గ్రామాలు శివారు ప్రాంతాల డివిజన్ల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి లో భాగంగా బుధవారం 21 వ డివిజన్ లో పర్యటించారు. శ్రీరాంనగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగంతో కలిసి రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం డివిజన్ లో స్థానిక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులను వేగవంతంగా నాణ్యత తో పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్ కు ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు తమ పాలకవర్గం పని చేస్తుందని తెలిపారు. కరీంనగర్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారం తో పాలకవర్గం ఏర్పడిన వంద రోజుల్లో కరీంనగర్ ను అర్బన్ చాలెంజ్ ఫండ్ స్కిం‌లో చేర్చి... 840 కోట్ల నిధులు తెచ్చామని... త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీస్కుంటున్నామని తెలిపారు. పాలకవర్గం ఏర్పిడితే పని చేస్తామని ప్రజలకు ఇట్టిన మాట ప్రకారం గడిచిన 7 నెలల కాలం కోట్ల రూపాయల నిధులతో డివిజన్ల లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. బండి సంజయ్ కుమార్ సహకారం తో 50 కోట్ల యూఐడీఎఫ్ నిధులతో డివిజన్ల లో పనులు చేపట్టామని 21 వ డివిజన్ కు 70 లక్షలు కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభం



చేశామన్నారు. మరో 30 కోట్ల యూఐడీఎఫ్ నిధులు తెచ్చి మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. 21 వ డివిజన్ లో అత్యధికంగా దాదాపు 6 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అంతే కాకుండా 15 ఆర్థిక సంఘం నుండి మంచి నాటి పైవులైన్ కోనం 50 లక్షలు కేటాయించామన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో యూసిఎఫ్ స్కీంలో నగరాన్ని మరింత మెరుగ్గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. టవర్ సర్కిల్ ప్రాంతం మొత్తం రద్దీగా ఉంటుంది కాబట్టి ప్రజలకు పార్కింగ్ సమస్య ఇబ్బందిగా మారడాన్ని దృష్టిలో పెట్టుకొని 25 కోట్ల నిధులతో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణంకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజల పార్కింగ్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. నగరంలోని ప్రధాన చౌరస్తాలలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా మల్టీ స్కైవాక్ ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం లోనే కరీంనగర్ నగరపాలక సంస్థ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి... మాడల్ సిటీగా మార్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కర్రె అనిల్, ఇంజనీరింగ్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో ఈ-పంట ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి

రైతులకు మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచన

కొత్తపల్లి 14: రైతులందరూ మూడు రోజుల్లో ఈ-పంట ఈకేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచించారు. ఈ-పంట ఈకేవైసీ ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అర్హత ఉంటుందని ఆమె తెలిపారు.ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులందరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పూర్తి చేసుకోవాలని కోరారు. రైతులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది లేదా రైతు సేవా సిబ్బందిని సంప్రదించి ఓటీపీ లేదా ఆధార్ ఫేస్ ఆథెంటికేషన్ ద్వారా ఈకేవైసీ చేయించుకోవచ్చని వివరించారు.అలాగే రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారా కూడా ఈ-పంట అధికారిక వెబ్‌సైట్ లో ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.కావున రైతులందరూ గడువులోగా ఈ-పంట ఈకేవైసీ పూర్తి చేసుకొని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి అమీరున్నిసా బేగం సూచించారు.



రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి గైనకాలజిస్ట్ నియామకం

-ఎంపీకి బీజేపీ నాయకులు కృతజ్ఞతలు

రామాయంపేట14: మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ప్రత్యేక చొరవతో రామాయంపేట ప్రభుత్వ అస్పత్రికి మహిళల ఆరోగ్య సంబంధిత చికిత్సల కోసం గైనకాలజిస్ట్ డాక్టర్ ను తెలంగాణ రాష్ట్ర వైద్య అధికారులతో మాట్లాడి నియమించడం జరిగిందని బిజెపి నాయకులు తెలిపారు.అస్పత్రి ప్రారంభించినప్పటి 8 ఏళ్ళ నుండి ఇక్కడ మహిళల ఆరోగ్య వైద్య నిపుణులు లేక చాలా మంది మెదక్ సిద్దిపేట కామారెడ్డి దుబ్బాక ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులకు పేద మధ్య తరగతి ప్రజలు గర్భిణులు వెళ్లేవారని పేర్కొన్నారు.ఎంపీ లక్షల రూపాయల ఖరీదైన డెంటల్ కుర్చీ లేకపోవడంతో డెంటల్ కుర్చీను హాస్పిటల్ కి డొనేట్ చేశారని తెలిపారు.దవాఖాన అభివృద్ధి కోసం మరిన్ని నిధులు విడుదల చేయడంలో పాటు మెదక్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంపీ రఘునందన్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నాలుగు మండలాల ప్రజలు ప్రభుత్వ అస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరుతున్నామన్నారు. గైనకాలజిస్ట్ నియామకంతో ఎంపీ రఘునందన్ రావుకు బిజెపి పార్టీ తరపున ఈ ప్రాంత ప్రజల



తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గొల్లపల్లి నవీన్ గౌడ్ అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి బిజెపి కౌన్సిలర్ జె.శంకర్ గౌడ్ బిజెపి సీనియర్ నాయకులు పబ్బ సత్యనారాయణ భాను చందర్ జిల్లా నాయకులు ఓబీసీ మహిళా మోర్చా నాయకులు మేకల లావణ్య చిమ్మనమైన అశోక్ సీనియర్ నాయకులు కటిక కార్తీక్ వి.దామోదర్ రావు పట్టణ యువ మోర్చ నాయకులు పోచమ్మల కన్నయ్య బండి యాదగిరి యువ నాయకులు అరవింద్ పాల్గొన్నారు.

ఆర్థిక ఆధారిత రిజర్వేషన్లకు ప్రత్యేక చట్టం తేవాలి....

అన్ని వర్గాల పేదలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సమన్యాయం కల్పించాలి.

ఓసీ జేఏసీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు పోలాడి రామారావు, గోపు జైపాల్ రెడ్డి

హుజురాబాద్ 14: కుల మతాలకతీతంగా ఆర్థిక ప్రాతిపదిక అన్ని వర్గాల పేదలకు విద్యా, ఉద్యోగ,ఉపాధి రంగాల్లో సమన్యాయం కల్పించడమే ధ్యేయంగా ఉద్యమం చేపడుతున్నామని, ఓసీ ఐకాస, ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన ఉద్యమ కమిటీ నాయకులు తెలిపారు. కుల, మత ప్రాతిపదికన అమలవుతున్న ప్రస్తుత రిజర్వేషన్ విధానానికి ప్రత్యామ్నాయంగా అన్ని సామాజిక వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఆర్థిక స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించి సమన్యాయం జరపాలని ఇందు కు కేంద్రం ప్రత్యేక చట్టం తేవాలని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు,రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి,ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన రాష్ట్ర కో. ఆర్డినేటర్ సంధి తిరుపతిరెడ్డి లు ప్రభుత్వాన్ని కోరారు.బుధవారం హుజురాబాద్ లో సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన ఉద్యమ కో ఆర్డినేషన్ కమిటీ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు పోరెడ్డి శంతన్ రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా, రాష్ట్ర ఓసీ ఐకాస ప్రతినిధులు, వివిధ సామాజిక వర్గాల సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.ఏ సామాజిక వర్గానికీ, మతానికీ తాము వ్యతిరేకం కాదని, కుల?మతాలకు అతీతంగా అన్ని వర్గాల్లోని పేదలకు సమాన అవకాశాలు లభించాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల సాధన కోసం సామాజిక ఉద్యమకారుడు ప్రవీణ్ ఆరోరా ఆధ్వర్యంలో ఢిల్లీలోని రాజ్‌ఘాట్ నుంచి చేపట్టిన దేశవ్యాప్త రథ యాత్ర కు ఓసీ జేఏసీ, బహుజన కుల సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ లో ఈనెల 24 న ఆదిలాబాద్ లో ప్రవేశించి 26 న జనగామ, హన్మకొండ మీదుగా పరకాల కు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుందని ఈ సందర్భంగా పరకాల లో ఓసీ జేఏసీ, బహుజన కుల సంఘాల ఆధ్వర్యంలో 26 న సాయంత్రం 5గంటలకు పార్టీల కతీతంగా 50 వేల మంది తో నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కు హుజురాబాద్,



హుస్నాబాద్ నియోజకవర్గాల నుంచి భారీ ఎత్తున తరలి రావాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుత రిజర్వేషన్ విధానంలో క్రిమిలేయర్ నిబంధనల అమలు లేకపోవడం తో రిజర్వేషన్ల ప్రయోజనాలు ఇవ్వటికే పొందిన కుటుంబాలకే ప్రయోజనాలు పునరావృతమవుతున్నాయనే వాదనల నేపథ్యంలో, అర్హులైన ఇతర పేదలకు న్యాయం జరగాలన్నారు. అవసరమైతే రాజ్యాంగ సవరణపై పార్లమెంట్‌లో చర్చించి శాశ్వత పరిష్కారం చూపాలని పోలాడి రామారావు,గోపు జైపాల్ రెడ్డి ల తో పాటు అధ్యత వహించిన పోరెడ్డి శంతన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.అనంతరం ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల ఉద్యమ బహిరంగ సభ గోడ ప్రతులను నాయకులుఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో ప్రోగ్రాం రాష్ట్ర కో ఆర్డినేటర్ సంధి తిరుపతి రెడ్డి ఓసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందుపట్లనర్సింహారెడ్డి,పెండ్యాల రాంరెడ్డి, ఎడవెల్లి కొండాల్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షులు తాటికొండ ప్రభావతి రాష్ట్ర బ్రాహ్మణ సంఘాల జేఏసీ కన్వీనర్ విష్ణు దాసు గోపాల రావు , ఉమ్మడి జిల్లా ఆర్య వైశ్య సబఘాల నేత తాటిపల్లి రాజన్న; ప్రోగ్రాం సోషల్ మీడియా కన్వీనర్ రావుల కిరణ్ రెడ్డి,మున్సిపల్ కౌన్సిలర్లు వర్ధనేని రవీందర్ రావు, వెంకట్ రెడ్డి,వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి ప్రసాద్,బిసి సంఘాల రాష్ట్ర కార్యదర్శి బచ్చు ఆనందం,దళితసంఘాల డివిజన్ నాయకులు వేల్పుల రత్నం, బత్తుల రాయలింగు నాయకులు కంకనాల జనార్దన్ రెడ్డి, ఏనుగు చొక్కా రెడ్డి,గూడూరి స్వామి రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ, అటవీ భూముల వివరాలపై తేల్చుకుందాం..

మీడియా ముందుకు రావాలి.

పాయం వెంకటేశ్వర్లుకు రేగా కాంతారావు సవాల్

భద్రాద్రి కొత్తగూడెం 14: మణుగూరు ఆస్తుల వివరాలు, ప్రభుత్వ భూములు, అటవీ భూములకు సంబంధించిన అంశాలపై రాజకీయంగా చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. పామాయిల్ తోటపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేయిస్తారంటూ పాయం వెంకటేశ్వర్లును ఉద్దేశించి రేగా కాంతారావు ప్రశ్నలు నందించారు. తుమ్మలచెరువులో కొనుగోలు చేసినట్లు చెబుతున్న 50 ఎకరాల భూమిలో ప్రభుత్వ భూమి ఎంత? అటవీ భూమి ఎంత? అనే అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు.ఇద్దరి ఆస్తుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి, వారసత్వంగా వచ్చిన ఆస్తులు, స్వయంగా సంపాదించిన ఆస్తుల వివరాలను ప్రజల ముందు ఉంచుదామని రేగా కాంతారావు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. మొరంపల్లి బంజర, దుమ్ముగూడెం, హైదరాబాద్ ప్రాంతాల్లోని భూముల వివరాలపైనా చర్చిద్దామని సవాల్ చేసినట్లు తెలిపారు.ప్రభుత్వ భూముల వ్యవహారాలపై విచారణ జరగాలిమణుగూరు పరిసర ప్రాంతాల్లో



ప్రభుత్వ భూముల విక్రయాలు, ఆక్రమణలకు సంబంధించి వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని రేగా కాంతారావు డిమాండ్ చేసినట్లు సమాచారం. ఆరు ఎకరాల భూమికి పట్టా కోసం ఈ వారంలో దరఖాస్తు చేసిన అంశాన్ని కూడా చర్చలోకి తీసుకురావాలని పేర్కొన్నారు.విజయనగరం ప్రాంతంలో సింగరేణి భూములకు సంబంధించి బినామీ పేర్లతో వ్యవహారాలు జరిగినట్లు చేస్తున్న ఆరోపణలు, గిరిజన ప్రాంతాల్లో 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల వివరాలపైనా స్పష్టత రావాల్సి ఉందని ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

మాన్కుబాయి మృతి తీరని లోటు

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాళి

జననినాదం,జైనూర్ 14: మాజీ సర్పంచ్ కొడప మారుతిరావు సతీమణి, ప్రస్తుత సర్పంచ్ కొడప ప్రకాష్ తల్లి కొడప మాన్కుబాయి మృతి తీరని లోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఆమె నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మారుతిరావు, మాన్కుబాయి సర్పంచులుగా ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అనారోగ్యంతో మాన్కుబాయి మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు షేక్ రషీద్, ఆత్రం శంకర్‌రావు, మాజీ సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, సర్పంచులు కనక ప్రతిభ, ఆత్రం మీరా, జాలిం షా, తోడశం రాజేందర్, డీసీసీ కార్యవర్గ సభ్యుడు



పెందూర్ ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, నాయకులు మెస్రం అంబాజీరావు, ఆడ అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

దీక్ష తీసుకున్న 60 మంది భవానీలు

మహబూబాద్ 14: పట్టణ కేంద్రంలోని భీష్మ యూత్ (పట్టణ గంగపుత్ర సంఘం) ఆధ్వర్యంలో 18వ శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భాగంగా ఈ సంవత్సరం 60 మంది భవానీలు దీక్ష తీసుకోవడం జరిగింది ఉదయం సాయంత్రం పూజా కార్యక్రమం జరుగుతున్నాయి సందీప్ శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది . ఈ కార్యక్రమంలో గురు భవాని స్వామిదేశాబోయిన విజయ్. భవానులు అవారి అనిల్, డోలి కృష్ణ, చుక్కల శ్రీనివాస్, డోలి ఉపేష్, దేశాబోయిన శ్రీనివాస్, కాపారబోయిన సురేష్, గుండాల



శీను, దేశాబోయిన అనిల్, చుక్కల నరేష్, ఆంకాల శ్రీకాంత్, సునీల్, సాయి రవి, శీను, సాంబశివరావు, పద్మ ఉమా, తదితరు భవానులుపాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ

నగునూరు వద్ద బిజెపి ఆధ్వర్యంలో భారీ ధర్నా

కరీంనగర్ 14:కరీంనగర్ మండలం నగునూరు వద్ద వ్యవసాయానికి నీటిని విడుదల చేయాలని బిజెపి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా బిజెపి జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ , మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ కరువు నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అరకొర నీటితో పంటలు వేసిన రైతుల పరిస్థితులను ప్రభుత్వం అర్థం చేసుకొని వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు . వర్షాలు లేక పంటలు వేసిన రైతులు పంటలు చేతికొచ్చే దశలో ఉన్నందున వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతు వ్యవసాయం తప్ప ఏ పని చేయడు కనుక అలాంటి రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని , అందుకోసమే రైతులకు అండగా మేము పోరాటం చేస్తున్నామన్నారు . వెంటనే కాకతీయ కెనాల్ నుండి వస్తున్న నీటిని వ్యవసాయానికి వాడుకునే విధంగా చిన్న కాలువల ద్వారా చెరువుల్లోకి , కుంటల్లోకి నీరు వెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దాదాపు అరగంట ధర్నా



నిర్వహించడంతో మంచిర్యాల – లక్షెట్టిపేట వెళ్లే ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాలు నిలిచిపోయి రాకపోకలు స్తంభించాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని నాయకులతో మాట్లాడి వారిని శాంతింప చేసి ధర్నాను విరమింపజేశారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తో పాటు సంతోష్ కుమార్ , జిల్లా సెక్రెటరీ సత్యం , పలువురు నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సాగునీటి కోసం గంగుల సమరశంఖం..

300 క్యూసెక్కుల నీటి విడుదలకు కృషి

కరీంనగర్ 14: కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ రైతులతో కలిసి ఎస్సారెస్పీ డీ-86 కెనాల్ వద్ద ఆందోళన చేపట్టారు. స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ రైతులతో కలిసి కెనాల్ వద్దకు చేరుకున్న ఆయన, రెగ్యులేటరీ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. నీరు విడుదల చేయకుంటే బ్రిడ్జిపై నుంచి దూకుతానని హెచ్చరించారు. అనంతరం అధికారులతో చర్చించి 300 క్యూసెక్కుల నీటి విడుదలకు కృషి చేశారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ పెద్దపల్లి ప్రాంత రైతులకు నీరు అందిస్తున్నప్పుడు కరీంనగర్, చొప్పదండి రైతులకు ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. డీ-83, డీ-86 కెనాళ్లకు సరిపడా నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులందరికీ సమానంగా సాగునీరు



అందించాలని, విడుదల చేసిన నీటిని నిలిపివేస్తే మరోసారి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం..

ఎమ్మెల్యే భూమా

ఆళ్లగడ్డ నంద్యాల జిల్లాఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో గతంలో పాత భవనంలో రోగులు, వైద్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 50 పడకల నూతన ఆసుపత్రి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతం కావడంతో ఆర్థో వైద్యుల కొరతను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన వైద్యులను అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రమాద బాధితులను నంద్యాలకు తరలించేలోపు ఇబ్బందులు ఎదురుకాకుండా భవిష్యత్తులో ఆళ్లగడ్డ ఆసుపత్రిలోనే అవసరమైన అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ హామీ ఇచ్చారు.అలాగే ఆసుపత్రి ఓపీ విభాగంలో రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఆళ్లగడ్డ మండలం పడకండ్ల గ్రామంలో రూ.75 లక్షలతో మెయిన్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా అంతర్గత డ్రైనేజీ పనులు చేపట్టాలని భావించినప్పటికీ, మెయిన్ డ్రైన్ లేకుండా



కాలువలు నిర్మిస్తే మురుగు నీరు బయటకు వెళ్లే అవకాశం ఉండదని గుర్తించినట్లు చెప్పారు. దీంతో అదనపు నిధులు సమకూర్చి మెయిన్ డ్రైన్ నిర్మాణాన్ని చేపట్టామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.మెయిన్ డ్రైన్ పూర్తయిన అనంతరం గ్రామంలోని అంతర్గత రోడ్లు, కాలువల నిర్మాణ పనులు కూడా చేపడతామని అఖిలప్రియ చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోనూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి మురుగు నీరు బయటకు వెళ్లేందుకు సరైన అవుట్‌ఫ్లో వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కూటమి హ్యామ్ పథకం కింద ఆళ్లగడ్డ పట్టణ అభివృద్ధికి రూ.21 కోట్ల నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రోజుల్లో ఆళ్లగడ్డ పట్టణంతో పాటు గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని భూమా అఖిలప్రియ స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు

తాండూర్ 12వ వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు

పనులను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్

తాండూర్14: మంచిర్యాల జిల్లా తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని 12వ వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు అడుగులు పడ్డాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి సహకారంతో, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ప్రారంభించారు.గ్రామంలోని వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటు రహదారి సమస్యలు తగ్గనున్నాయి. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్,



కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ ఈసా, వార్డు సభ్యులు రెండ్ల శిరీష?అశోక్, కాంగ్రెస్ నాయకులు భాస్కర్ గౌడ్, కంపెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది

పౌష్టికాహారం, మెరుగైన సంరక్షణ అందించడమే లక్ష్యం: సర్పంచ్ ముడిమడుగుల సురేష్

తాండూరు14: గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు మెరుగైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ అందించడమే లక్ష్యంగా తాండూరు గ్రామపంచాయతీ పరిధిలో పునఃస్థాపించిన అంగన్వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సర్పంచ్ ముడిమడుగుల సురేష్ మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడం, సంపూర్ణ ఎదుగుదలకు తోడ్పడటంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని సూచించారు.చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతోపాటు, వారి ఆరోగ్యం, ఎదుగుదలపై అంగన్వాడీ



సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. తల్లిదండ్రులు కూడా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, ఎండీ ఈసా, ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్వైజర్ రమ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం
చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం
గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది
రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి,14: నాగర్‌కర్నూల్ జిల్లా, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.
పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అకింతం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ద్వజమెత్తారు.మహాత్మాగాంధీ--కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి



చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు.రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు.
సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, సూపర్డెంట్ ఇంజనీరు పార్థ సారథి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయొద్దు

సర్పంచ్ కుమ్ర దేవ్ షావ్ పటేల్

జననినాదం, జైనూర్ 14:టీబీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని మన్‌కుగూడ సర్పంచ్ కుమ్ర దేవ్ షావ్ పటేల్ సూచించారు. జైనూర్ మండలం మన్‌కుగూడ గ్రామపంచాయతీలో బుధవారం ఉచిత టీబీ నిర్ధారణ, హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, రాత్రివేళల్లో జ్వరం, బరువు తగ్గడం, ఛాతినొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశా కార్యకర్తలను సంప్రదించాలన్నారు. పేర్లు నమోదు చేసుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, టీబీ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందిస్తారని తెలిపారు. గ్రామపంచాయతీలో తొలిసారిగా ప్రత్యేక శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హరిచంద్, కారోబార్ కుమ్ర విష్ణు, ఆశా కార్యకర్తలు రంబా, పార్వతి, జంగుబాయి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.





గంజాయి సాగు, విక్రయాలను అరికట్టాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి అక్టోబర్ 14: గంజాయి సాగు, విక్రయాలతో యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. సీఐ నీలం రవికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పత్తి చేలలో గంజాయి సాగు చేస్తూ యువతకు విక్రయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని, గంజాయికి బానిసలవుతున్న యువత జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని, మత్తు ప్రభావంతో మహిళలు, బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి సాగు, విక్రయాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, యువతకు అవగాహన సదస్సులు నిర్వహించి మత్తు



పదార్థాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గేడం టీకానందు, కోశాధికారి దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460